

అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణ పథకానికి బుధవారం వికారాబాద్‌కు చెందిన జి.బిచ్చప్ప రూ.1,00,101 విరాళాన్ని అన్నదాన పర్యవేక్షకులు సి.మధుసూదన్‌రెడ్డికి అందజేశారు.



సాంస్కృతిక ప్రదర్శనలు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలంలో బుధవారం ఆయా వేదికలపై సంప్రదాయ నృత్యప్రదర్శనలు, భక్తిరంజని, హరికథ కార్యక్రమాలను నిర్వహించారు.

ఉష్ణోగ్రత

కనిష్టం	25.6
గరిష్టం	39.7

న్యూస్‌రీల్

రెండో దశలో 330 ఆరోగ్య సురక్ష క్యాంపులు

వెల్దుర్తి(కృష్ణగిరి): రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 330 క్యాంపులు విజయవంతంగా నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య తెలిపారు. ఈ శిబిరాల్లో రెండు లక్షలకుపైగా ప్రజలకు ఆరోగ్య సేవలందించామన్నారు. అత్యవసరమైన 900 మందికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్స అందించామన్నారు. బుధవారం వెల్దుర్తి మండల కేంద్రంలోని హరిజనవాడ ఎంపీపీ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. ఈ శిబిరంలో 420మందికి వైద్య సేవలు అందించారు. స్పెషలిస్టు వైద్యులు చంద్రశేఖర్, వెంకటనారాయణ, వైద్యాధికారులు భువనతేజ, ప్రతిభ, ఆప్తాలిస్టు కవిత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులూ.. ఉత్సవాల్లో పాల్గొనండి

కర్నూలు(అర్బన్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ సృజన అనుమతితో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న మహిళాఉద్యోగులు పాల్గొనాలని జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 8వ తేదీన మహా శివరాత్రి సెలవు కారణంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలను ఈ నెల 7వ తేదీన (నేడు) నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సమావేశ భవనంలో కార్యక్రమాలను ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆర్‌ఎన్‌టీసీపీ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ కొనసాగింపు

- తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు, నంద్యాల జిల్లాలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల నోటిఫికేషన్ రిక్రూట్‌మెంట్‌ను కొనసాగించనున్నట్లు జిల్లా లెప్రసి, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఎన్‌టీసీపీ(ఎన్‌టీఈపీ)లో మెడికల్ ఆఫీసర్-డీటీసీ, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్, డిస్ట్రిక్ట్ పీపీఎం కో ఆర్డినేటర్, డాట్స్ ప్లస్ టీబీ హెచ్‌ఐవి సూపర్‌వైజర్, ల్యాబ్ టెక్నీషియన్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్, సీనియర్ ట్రీట్‌మెంట్ ల్యాబ్ సూపర్‌వైజర్, ట్యూబర్ కులోసిస్ హెల్త్ విజిటర్, అకౌంటెంట్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిని భర్తీ చేసేందుకు గత సంవత్సరం ఆగస్టు 30న నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ రిక్రూట్‌మెంట్‌ను కొనసాగిస్తామన్నారు. ఈ మేరకు తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల చేశామన్నారు. ఇందుకు సంబంధించిన అభ్యంతరాలను ఈ నెల 7 నుంచి 11వ తేది వరకు స్వీకరిస్తామన్నారు.

4.26 లక్షల ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో ఇప్పటి వరకు 4.26 లక్షల నూతన ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారని, మిగిలిన 88,823 కార్డులను బుధవారం సాయంత్రంలోపు పంపిణీ చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్ట్ జి.సృజన ఆదేశించారు. బుధవారం ఉదయం టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్షించారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో కర్నూలు డివిజన్‌లో 10,521, ఆదోని డివిజన్‌లో 3,425, పత్తికొండ డివిజన్‌లో 955 డాక్యుమెంట్లను లబ్ధిదారులకు సోమవారంలోపు అందించాలన్నారు. జిల్లాలో ఎంఎస్‌ఎంఈ సర్వేలో భాగంగా ఇప్పటి వరకు 138 పరిశ్రమలను గుర్తించి యాప్‌లో నమోదు చేశారని, మిగిలిన ప్రదేశాల్లో ఉండే వాటిని రెండు మూడు రోజుల్లో గుర్తించాలన్నారు. జేసీ మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణ్ శర్మ పాల్గొన్నారు.

అమేయం..ఆర్థిక సాయం

- అతివల ఆర్థిక పురోగతికి వైఎస్సార్ చేయూత పథకం
- మూడేళ్లలో రూ.666.50 కోట్ల లబ్ధి
- నేడు 4వ ఏడాది 'చేయూత' నిధుల విడుదల
- అనకాపల్లి నుంచి విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్
- జిల్లాలో 1,27,626 మంది మహిళలకు ప్రయోజనం
- ఈనెల 13 వరకు 'చేయూత' సంబరాలు



జీవనోపాధులపై చర్చిస్తున్న మహిళలు (ఫైల్)

కర్నూలు (అగ్రికల్చర్): మహిళా సాధికారతకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. పెద్ద ఎత్తున ఆర్థిక సాయం అందిస్తూ అతివల అభ్యున్నతికి తోడ్పాటును అందిస్తోంది. 45 నుంచి 60 ఏళ్ల లోపు కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం కింద ఏటా రూ. 18,750 చొప్పున ఇస్తోంది. అవినీతికి తావులేకుండా మహిళల బ్యాంకు ఖాతాలకు నేరుగా డీబీటీ ద్వారా నగదు బదిలీ చేస్తోంది. ఇప్పటి వరకు మూడేళ్లుగా చేయూత కింద ఆర్థిక తోడ్పాటు ఇచ్చింది. నాలుగో ఏడాది కూడా గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లిలో జరిగే కార్యక్రమంలో బటన్ నొక్కి నిధులు విడుదల చేయనున్నారు. జిల్లాలో రూ.230.30 కోట్లు మహిళల బ్యాంకు ఖాతాలకు విడుదల కానున్నాయి.

నాలుగేళ్లలో రూ.905.80 కోట్ల లబ్ధి

వైఎస్‌ఆర్ చేయూత కింద నాలుగేళ్లలో జిల్లాలోని మహిళలకు రూ.905.80 కోట్ల లబ్ధి చేకూరింది. 2022-23 వరకు రూ.666.50 కోట్లు ప్రయోజనం లభించగా.. ఈ ఏడాది రూ.239.30 కోట్లు విడుదల కానున్నాయి. గ్రామీణ, అర్బన్ ప్రాంతాలకు చెందిన 1,27,626 మందికి మహిళలకు ఆర్థిక లబ్ధి చేకూరింది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన 93,127 మంది మహిళలకు రూ.653.10 కోట్లు, పట్టణ ప్రాంతాలకు చెందిన 34,499 మంది మహిళలకు రూ.252.70 కోట్లు ప్రకారం ఆర్థిక ప్రయోజనం లభించింది. నాలుగో ఏడాదికి సంబంధించి గ్రామీణ మహిళలకు రూ.174.61 కోట్లు, పట్టణ ప్రాంత మహిళలకు రూ.64.69 కోట్లు ప్రయోజనం కలుగుతోంది. 4వ ఏడాది 'చేయూత' ద్వారా ఎస్సీ మహిళలు 26,146, ఎస్టీ మహిళలు 1,820, బీసీ మహిళలు 97,350, మైనార్టీ మహిళలు 2.148, క్రిస్టియన్ మహిళలు 162 మంది ప్రయోజనం పొందనున్నారు. వైఎస్‌ఆర్ చేయూత నిధుల విడుదలను పురస్కరించుకొని ఈ నెల 13 వరకు ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించనున్నారు.

71,029 మంది మహిళల జీవితాల్లో వెలుగులు

వైఎస్సార్ చేయూత పథకం కింద లభించిన ఆర్థిక సాయంతో మహిళలు తమకు ఆసక్తి కలిగిన వృత్తులు, వ్యాపారాల్లో రాణిస్తున్నారు. జిల్లాలో 71,029 మంది వివిధ రకాల జీవనోపాధులను వృద్ధి చేసుకున్నారు. అన్ని ఖర్చులు పోగా నెలకు సగటున కనిష్టంగా రూ.10వేలు, గరిష్ఠంగా రూ.30 వేల వరకు నికరాదాయం పొందుతున్నా రు. కొందరు మహిళా మార్ట్‌లు నడుపుతున్నారు. మరికొందరు పసుపు, కారం పొడి మిషన్‌లు ఏర్పాటు చేసుకొని.. వాటిని ప్యాక్ చేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. పొట్టేళ్ల, పెరటికోళ్ల పెంపకం, పాడి పరిశ్రమలో చాలా మంది రాణిస్తున్నారు. వస్త్ర, కిరాణ దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు.

ఈ చిత్రంలోని మహిళ పేరు గువ్వల జయమ్మ. కర్నూలు మండలం పి.రుద్రవరం గ్రామానికి చెందిన ఈమె అంబేడ్కర్ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలుగా ఉన్నారు. ఈ మహిళకు వైఎస్‌ఆర్ చేయూత పథకం కింద మూడు విడతల్లో రూ.56,250 ఆర్థిక సాయం అందింది. ఈ నిధులతో శిరీష కిరాణం స్టోర్‌ను ఏడాది క్రితం ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు కెనరా బ్యాంకు రూ. 50 వేలు అప్పు ఇచ్చింది. దీంతో కిరాణం వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకున్నారు. రిలయన్స్, హెచ్‌యూఎల్, ఐటీసీ కంపెనీలు నాణ్యమైన నిత్యావసర వస్తువులు సరఫరా చేస్తున్నాయి. అన్ని ఖర్చులు పోను నెలకు రూ.15000 నుంచి రూ. 1,8000 వరకు నికరాదాయం పొందుతున్నారు. వైఎస్‌ఆర్ చేయూత తమ జీవితాన్ని మలుపుతిప్పిందని ఈమె తెలిపారు.



టీడీపీ హయాంలో మహిళా సంక్షేమం శూన్యం

టీడీపీ హయాంలో మహిళా సంక్షేమానికి ఒక్క పథకం కూడా అమలు కాలేదు. బ్యాంకులు లింకేజీ రుణాలు ఇవ్వడం తప్పితే మహిళా సంక్షేమానికి ప్రత్యేకంగా తీసుకున్న చర్యలు శూన్యమనే చెప్పవచ్చు. 2014 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని నమ్మించి మోసం చేశారు. మళ్లీ ఎన్నికలు వస్తుండటంతో నూతన వాగ్దానాలతో ముందుకు వస్తున్నారు. చంద్రబాబు మాటలను మహిళలు నమ్మే స్థితిలో లేరు.

నాలుగేళ్లలో వైఎస్సార్ చేయూత ఆర్థిక తోడ్పాటు ఇలా

సంవత్సరం	లబ్ధిపొందిన మహిళలు	ఆర్థిక లబ్ధి (రూ.కోట్లలో)
2020-21	1,11,316	208.72
2021-22	1,20,106	225.20
2022-23	1,24,045	232.58
2023-24	1,27,626	239.30

4వ ఏడాది నియోజకవర్గాల వారీగా విడుదల కానున్న నిధుల వివరాలు

నియోజకవర్గం	లబ్ధిపొందే మహిళలు	4వ ఏడాది విడుదలయ్యే నిధులు (రూ.కోట్లలో)
ఆదోని	16,340	30.64
ఆలూరు	18,455	34.40
కోడుమూరు	16,665	31.30
కర్నూలు	18,639	34.95
మంత్రాలయం	15,553	29.16
పాణ్యం (కల్లూరు,ఓర్వకల్లు)	8,193	15.36
పత్తికొండ	16,619	31.16
ఎమ్మిగనూరు	17,162	32.18

జీవనోపాధులు మెరుగుపడ్డాయి



ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో మహిళల జీవనోపాధులు మెరుగుపడ్డాయి. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మహిళలు జీవితంలో స్థిరపడేందుకు మంచి అవకాశం ఏర్పడింది. ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక తోడ్పాటుతో వేలాది మంది మహిళలు వివిధ వృత్తుల్లో రాణిస్తున్నారు. ఇప్పటి వరకు మూడేళ్ల పాటు 'చేయూత' అమలైంది. నాలుగో ఏడాది రూ.239.30 కోట్లు విడుదల కానున్నాయి. ఈ నెల 7 నుంచి 13 వరకు 'చేయూత' సంబరాలు నిర్వహించనున్నాం.

– సలీమ్‌బాషా, డీఆర్‌డీఏ, వైకేపీ పీడీ

అన్నదాతలకు ఎంతో మేలు



రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య, మేయర్ బీవై రామయ్య, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి తదితరులు

- జిల్లాలో 3,48,106 మంది రైతులకు రూ.433.70 కోట్ల జమ
- తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి పంపిణీ చేసిన సీఎం వైఎస్‌జగన్
- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

కర్నూలు(సెంట్రల్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నదాతలకు ఎంతో మేలు జరుగుతోందని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన అన్నదాతలకు ఇన్‌పుట్ సబ్సిడీని బటన్ నొక్కి జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకరరెడ్డి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విజయ మనోహరి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, రైతులు వర్చువల్‌గా వీక్షించారు. ఈ సందర్భంగా మేయర్, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ మాట్లాడుతూ.. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అన్నదాతల పక్షపాతి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లుగా రైతుల కోసం వైఎస్‌ఆర్ రైతు భరోసా ద్వారా ఏటా రూ.13,500 ఇస్తున్నారని, వైఎస్‌ఆర్ సున్నా వడ్డీని అందిస్తున్నారని చెప్పారు. రూపాయి ఖర్చు లేకుండా వైఎస్‌ఆర్ పంటల బీమాను వర్తింపజేస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పంటలకు అవసరమైన మందులు, ఎరువులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నారు. పంటలు నష్టపోతే అదే సీజన్‌లో పంట నష్ట పరిహారాన్ని అందిస్తున్నారు. అందులో భాగంగా ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి అందుకుంటున్నారని చెప్పారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ..కర్నూలు జిల్లాలో ఖరీఫ్-2023లో వ్యవసాయ పంటలకు సంబంధించి 2,38,230.92 హెక్టార్లలో పంటలు దెబ్బతినడంతో 2,90,741 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో 371.05 కోట్లను జమ చేసినట్లు చెప్పారు. అలాగే ఉద్యాన పంటలకు సంబంధించి 36,855 హెక్టార్ల వివిధ రకాల పంట పొలాలు దెబ్బతినడంతో 57,365 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలో రూ.62.65 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. అనంతరం ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా లబ్ధి పొందిన 3,48,106 మందిరైతులకు రూ.433.70 కోట్ల మెగా చెక్కును అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అందించారు.

గతంలో ఇంత మేలు జరగలేదు



నాకున్న 13 ఎకరాల్లో శనగను పంటను వేశాను. వర్షాలు పడకపోవడంతో పంట ఎండిపోయి తీవ్ర నష్టం కలిగించింది. ఈక్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేయించడంతో నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందించింది. ఆర్‌బీకేల ద్వారా నేను విత్తనాలు తీసుకొని పంటను వేశాను. గతంలో రైతుకు ఇంత మేలు చేసిన ప్రభుత్వాలు లేవు. రైతులంతా జగనన్నకు అండగా ఉంటారు.

– బి.రామశేఖర్, కల్లూరు

జగనన్నకు రుణపడి ఉంటాం



చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో వరుస కరువులు వచ్చేవి. అయితే ఆయన ఏనాడూ పంట నష్ట పరిహారం ఇవ్వలేదు. ఇప్పుడు పంటలు నష్టపోయిన వెంటనే అధికారులు పొలాల దగ్గరకు వచ్చి అంచనా వేశారు. ఈక్రాప్ బుకింగ్ చేయించారు. పరిహారం ఇవ్వడంతో చాలా మేలు జరిగింది. జగనన్నకు రుణపడి ఉంటాం.

– కె. వెంకటేశ్వర్లు, కల్లూరు



వైభవం.. పుష్ప పల్లకోత్సవం

శ్రీశైలంటెంపుల్: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలతో శ్రీగిరి క్షేత్రం ఇల కైలాసాన్ని తలపిస్తోంది. శివ భక్తులు మల్లన్న దర్శనానికి తరలివస్తున్నారు. బ్రహ్మోత్సవ సంబరాలు అంబరాన్ని తాకుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో 6వ రోజు బుధవారం భ్రమరాంబసమేత మల్లికార్జునుడు పుష్పపల్లకీలో కొలువై దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. క్షేత్రంలోని తూర్పు, దక్షిణ మాడవీధుల్లో జరిగిన పుష్పపల్లకీ గ్రామోత్సవంలో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. వివిధ రకాల సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవారర్లను ఆశీనులను చేశారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు ప్రత్యేక పూజా హారతులిచ్చారు. గ్రామ పురవీధుల్లో ఉత్సవమూర్తులు పల్లకీలో విహరిస్తుండగా అశేష భక్తజనవాహిని కనులారా దర్శించి కర్పూర నీరాజనాలు సమర్పించారు. గంగాధర మండపం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం నందిమండపం, బయలు వీరభద్రస్వామి ఆలయం మీదుగా రాజగోపురం వరకు సాగింది. కళాకారుల ప్రదర్శనల నడుమ గ్రామోత్సవం నేత్రానందభరితంగా సాగింది. పూజా కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో డి.పెద్దిరాజు దంపతులు సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీశైలంలో నేడు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవరోజు గురువారం సాయంత్రం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు గజవాహనసేవ, గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తారు.

బీసీ డిక్లరేషన్ పేరుతో బాబు మోసం

- ఓట్ల కోసమే రూ.1.50 లక్షల కోట్లు అంటూ డ్రామా
- వెనుకబడిన కులాలను ఏనాడు పట్టించుకోని టీడీపీ
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, చిత్రంలో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి తదితరులు

కర్నూలు (టౌన్): బీసీ డిక్లరేషన్ పేరుతో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య విమర్శించారు. ఓట్ల కోసమే బీసీలకు రూ.1.50 లక్షల కోట్లు అంటూ డ్రామాలు ఆడుతున్నారన్నారు. కర్నూలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏనాడూ బీసీ కులాలను ఆదుకున్న పాపాన పోలేదన్నారు. ఓట్ల కోసం తప్ప, వెనుకబడిన కులాల సంక్షేమాన్ని ఏనాడూ పట్టించుకోలేదన్నారు. బీసీలకు బ్యాక్‌బోన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే అన్నారు. రాష్ట్రంలో 82 వేల మంది బీసీలకు పదవులు ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు.

- వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఇంతియాజ్ బాషా మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన, అన్ని వర్గాలకు అందుతున్న సంక్షేమాన్ని చూసి తాను ఐఏఎస్ పదవికి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు. తన మామ డాక్టర్ ఇస్మాయిల్‌కు కర్నూలు నగరంలో ఎంతో పేరు ఉందని, ఆయన చేసిన సేవా కార్యక్రమాలను కొనసాగించేందుకు తనకు అవకాశం ఇవ్వాలని కోరారు.
- కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. పేద వర్గాలకు న్యాయం జరిగిందంటే అది వైఎస్ జగన్ హయాంలోనే అన్నారు. కర్నూలు ఎమ్మెల్యేగా ఇంతియాజ్‌ను గెలిపించుకుందామన్నారు.
- మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ముచ్చటగా మూడో సారి కర్నూలులో వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలవబోవడం ఖాయమన్నారు.
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, పార్టీ నేతలు తెర్నెకల్ సురేందర్‌రెడ్డి, సీహెచ్ మద్దయ్య, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు రెడ్డిపోగు ప్రశాంత్, తిరుమలేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుమ్మనూరును వాల్మీకులు క్షమించరు

- ఆత్మగౌరవాన్ని చంద్రబాబు వద్ద తాకట్టు పెట్టారు
- వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విరూపాక్షి

ఆలూరు: మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంను వాల్మీకులు ఎట్టిపరిస్థితుల్లో క్షమించబోరని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి అన్నారు. వాల్మీకుల ఆత్మగౌరవాన్ని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వద్ద గుమ్మనూరు తాకట్టు పెట్టారన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విరూపాక్షి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించి, పదవులు ఇచ్చి గౌరవించారని, ఈ విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. సర్వేలు చేయించిన తర్వాతనే తనను ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారన్నారు. వాల్మీకులతో ముందుకెళ్లాలని సీఎం సూచించినప్పటికీ జయరాం విస్మరించారన్నారు. మంత్రి వర్గంలో రెడ్ల కులస్తులకు, సమీప బంధువులకు ఇవ్వనంత ప్రాధాన్యత గుమ్మనూరుకు ఇచ్చారన్నారు. అక్రమాలను కప్పి పుచ్చుకోవడానికి పార్టీ మారిన గుమ్మనూరు.. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని, ఇందుకు దీటుగా సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు తాను అండగా ఉంటానన్నారు.

విరూపాక్షి వెంట ఉంటాం

తామంతా వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విరూపాక్షి వెంట ఉంటామని, వచ్చే ఎన్నికల్లో కలసికట్టుగా పని చేస్తామని ఆలూరు, హాలహర్వి ఎంపీపీలు రంగమ్మ, నెట్టేకంటమ్మ, ఆస్పరి జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, దేవనకొండ, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద, ఆస్పరి మండల కన్వీనర్లు మారయ్య, రామిరెడ్డి, షఫిఉల్లా, శ్రీనివాసులు, పెద్దయ్య తెలిపారు. గుమ్మనూరు పార్టీ మారినంత మాత్రాన వైఎస్సార్‌సీపీకు బలంలేదని టీడీపీ నాయకులు అనుకోవడం మూర్ఖత్వమని అన్నారు. విలేకరుల సమావేశంలో సింగిల్ విండో చైర్మన్లు గోవర్ధన్, హనుమంతమ్మ, పార్టీ నాయకులు దత్తాత్రేయరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, రాజారెడ్డి, మల్లికార్జున, వీరేష్, జనార్ధన్‌నాయుడు, తిప్పారెడ్డి, తిమ్మప్ప, దుబ్బలింగ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కృషి సఖిలకు విస్తృత శిక్షణ

నంద్యాల(సెంట్రల్): గ్రామస్థాయి వరకు ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించేందుకు నియమించిన కృషి సఖిలకు విస్తృత శిక్షణ ఇస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజరు నరేంద్ర రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వయం సహాయక సంఘాల వీవోఏ (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్)ల నుంచి జిల్లా వ్యాప్తంగా 86 మందిని కృషిసఖిలుగా ఎంపిక చేసి 5 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో మొదటి రోజు డివిజన్ స్థాయిలో, రెండో రోజు నుంచి మండల స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. డీఆర్‌డీఏ, రైతు సాధికార సంస్థ(ఆర్‌వైఎస్‌ఎస్) సంయుక్తంగా చేపడుతున్న ఈ శిక్షణ కార్యక్రమాల్లో ప్రకతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలు, రైతులకు నిరంతర ఆదాయం కోసం 365 డీజీసీ మోడల్స్–ఏ గ్రేడ్, తోటల పెంపకంపై ఆచరణాత్మక శిక్షణ ఇస్తున్నామని వివరించారు.

అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ట నిఘా



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, చిత్రంలో ఎస్పీ జి.కృష్ణకాంత్

కర్నూలు(సెంట్రల్): సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ట నిఘా ఉంచాలని, ఇందుకు బళ్లారి, రాయచూరు జిల్లాల అధికారులు సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్ కోరారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి బళ్లారి, రాయచూరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు తెలంగాణతోపాటు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు, బళ్లారి జిల్లాలతో అంతర్రాష్ట్ర సరిహద్దు ఉందన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల నుంచి అక్రమంగా మద్యం, డబ్బు సరఫరా కాకుండా నిఘా ఉంచాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా ఉన్న కార్యకలపాలను నియంత్రించడంలో తగిన సహకారం అందించాలని కోరారు. ఇందుకోసం తమ వైపు నుంచి నోడల్ అధికారులను నియమించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ..రాయచూరు జిల్లాలోని రాయచూరు రూరల్ అసెంబ్లీ, బళ్లారి జిల్లాలోని మాన్వి, సిరిగుప్ప, మోకా, కంప్లీ అసెంబ్లీ నియోజకవర్గాలు జిల్లాకు సరిహద్దుగా ఉన్నాయన్నారు. జిల్లాలోని ఆలూరు, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాలు కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్నాయన్నారు. జిల్లా సరిహద్దులో ఐదు ఇంటిగ్రేటేడ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పటిష్ట నిఘాకు బళ్లారి, రాయచూరు అధికారులు సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

అవినీతికి 'మూర్ఛపోవాల్సిందే'!

ఆరోగ్యశ్రీలో రూ.9కోట్ల స్కాం

- పక్షవాతం రాకపోయినా చికిత్స చేసినట్లు బిల్లులు
- 1850 పైగా రోగుల పేరిట దందా
- వెలుగులోకి కర్నూలులోని గాయత్రి హాస్పిటల్ బాగోతం
- సహకరించిన ఓ స్కానింగ్ సెంటర్ మేనేజర్
- ఆసుపత్రిని సస్పెండ్ చేసిన ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు పల్లె జ్యోతి. నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం నారాయణపురం గ్రామవాసి. ఈమెకు పక్షవాతం చికిత్స చేసి డిశ్చార్జ్ చేసినట్లు గాయత్రి హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ సిబ్బంది ఫొటో తీశారు. అనుమానం వచ్చిన ట్రస్ట్ అధికారులు విచారణ చేయగా ఆమెకు ఎలాంటి అనారోగ్యం లేదని నిర్ధారణ అయ్యింది. తాను కుట్టుమిషన్ కుడుతుంటే కొద్దిగా కాలునొప్పి ఉండి ఆసుపత్రికి వెళ్తే అడ్మిట్ చేసుకొని డిశ్చార్జి చేశారు. అంతకు మించి తనకు ఏమీ తెలియదని ఆమె చెబుతోంది.



గాయత్రి హాస్పిటల్‌లో విచారణ చేస్తున్న అధికారులు, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో ఉన్న గాయత్రి హాస్పిటల్‌లో పలు రకాల వ్యాధులకు డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ అనుమతులు తీసుకుంది. స్థానికంగా పేరున్న ఆసుపత్రులు పక్షవాతానికి సంబంధించిన మెడికల్ కేసులను తీసుకునేందుకు వెనుకంజ వేయగా.. గాయత్రి ఆసుపత్రి మాత్రం అనుమతులు తీసుకొని పెద్ద ఎత్తున ప్రచారం కూడా సాగించింది. పక్షవాతం రోగికి చికిత్స చేస్తే ఆసుపత్రికి రూ.20వేల ప్యాకేజీ అందుతుంది. డిశ్చార్జి అనంతరం విశ్రాంతి తీసుకునే సమయంలో ఆసరాగా మరో రూ.30వేలు వస్తుంది. అంటే ఒక రోగికి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద రూ.50వేలు చెల్లిస్తుంది. ఈ మొత్తంపై ఆసుపత్రి యాజమాన్యానికి కన్నుపడింది. అడ్డదారుల్లో నొక్కేసేందుకు పథకం రచించింది.

పక్షవాతం రాకపోయినా వచ్చినట్లు !

గాయత్రి ఆసుపత్రి తమ దందాకు ఆర్‌ఎంపీలను ఎంచుకుంది. ఎలాంటి పక్షవాతం లేకపోయినా ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వాళ్లను తీసుకొస్తే చాలు కమీషన్ ఇస్తామని గాలం వేసింది. ఇలా కేవలం కొన్ని నెలల కాలంలోనే 1,850 పైగా పక్షవాతం రోగులకు చికిత్స చేయడం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారుల కంట పడింది. దీంతో ఇతర జిల్లాల్లోని రేడియాలజిస్టు డాక్టర్ మనోరంజన్‌రెడ్డి, న్యూరోసర్జన్ డాక్టర్ రవిప్రకాష్, న్యూరోఫిజీషియన్ డాక్టర్ రవి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నుంచి డాక్టర్ రాజగోపాల్‌రెడ్డి రెండు వారాల క్రితం విచారణ చేశారు. ఆసుపత్రిలోని రోగుల కేస్‌షీట్‌లు, రిపోర్టులు, రికార్డులు పరిశీలించారు.

డయాగ్నోస్టిక్ సెంటర్ మేనేజర్‌తో కలిసి దందా

- ఆరోగ్య శ్రీ లబ్ధిదారునికి పక్షవాతం వచ్చినట్లు ఆసుపత్రిలో చేర్చుకుంటున్నారు.
- వీళ్లకు కొత్తబస్టాండ్ ఎదుటనున్న జ్యోతి డయాగ్నోస్టిక్ సెంటర్, చిన్నపార్కు వద్దనున్న మరో డయాగ్నోస్టిక్ సెంటర్‌లో సీటీ స్కానింగ్ చేయిస్తారు.
- అక్కడి వైద్యులు నివేదికలు పక్కాగా ఇచ్చినా డయాగ్నోస్టిక్ సెంటర్ మేనేజర్ కిరణ్‌కుమార్ స్కామ్‌కు పునాది వేశారు.
- డయాగ్నోస్టిక్ సెంటర్‌కు చెందిన రిపోర్టుల బుక్‌ను గాయత్రి హాస్పిటల్‌కు కొన్ని తరలించారు.
- డయాగ్నోస్టిక్ సెంటర్ నుంచి వచ్చిన నివేదికలను పక్కన పెట్టి ఆసుపత్రి వద్ద ఉన్న నివేదికలతో నకిలీ రిపోర్టులు సృష్టిస్తున్నారు.
- గత అక్టోబర్ నెలలోనే డయాగ్నోస్టిక్ సెంటర్‌లో పనిచేసే రేడియాలజిస్టు ఇతర జిల్లాకు వెళ్లిపోయినా ఆయన పేరుతోనే ఇప్పటికీ నివేదికలు ఇస్తున్నట్లు అధికారులు గుర్తించారు.
- ఆ నకిలీ నివేదికల ఆధారంగా ఆరోగ్యశ్రీ లబ్ధిదారునికి ఆసుపత్రిలో న్యూరో ఫిజీషియన్ డాక్టర్ ప్రభాకర్‌రావు చికిత్స చేసినట్లు రికార్డులు సృష్టించారు.
- అయితే ఆసుపత్రిలో న్యూరోఫిజీషియన్ వైద్యులే లేకపోవడం గమనార్హం.

రూ.9కోట్లకు పైగా కుంభకోణం

గాయత్రి హాస్పిటల్‌లో కొన్ని నెలల కాలంలోనే 1,850 పైగా పక్షవాతం రోగులకు చికిత్స చేసినట్లు నిధులు డ్రా చేసుకున్నారు. ఇలా ఈ ఒక్క ఆసుపత్రిలోనే రూ.9కోట్ల వరకు కుంభకోణం జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. క్లెయిమ్ రూ.20వేలు నేరుగా ఆసుపత్రి ఖాతాలో జమ అవుతోంది. రోగి ఖాతాలో జమయ్యే రూ.30వేలలో రోగికి కొంత, ఆర్‌ఎంపీకి కొంత మొత్తం మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని ఆసుపత్రి యాజమాన్యం నొక్కేస్తుంది.

సస్పెన్షన్‌లో గాయత్రి ఆసుపత్రి

పక్షవాతం లేకపోయినా చికిత్స చేసినట్లు చూపి నిధులు కాజేసిన ఆరోపణలతో గాయత్రి హాస్పిటల్‌పై విచారణ కొనసాగుతోంది. ప్రాథమిక విచారణలో వాస్తవాలు వెల్లడి కావడంతో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులు ఆసుపత్రిని సస్పెన్షన్‌లో ఉంచారు. సీటీ స్కాన్‌లో మేనేజర్ సత్యనారాయణ స్కామ్ చేశాడని, మా డయాగ్నోస్టిక్ సెంటర్‌కు ఎలాంటి సంబంధం లేదని జ్యోతి డయాగ్నోస్టిక్ సెంటర్ బాధ్యులు లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు.

– డాక్టర్ భాస్కరరెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్, కర్నూలు

8 మంది డీటీలకు స్థానచలనం

డిప్యూటీ తహసీల్దార్ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
వహాబ్	అమరావతి ఎక్స్‌ప్రెస్‌హైవే కార్యాలయం, కర్నూలు	నందవరం
వైకే రామేశ్వరరెడ్డి	కౌతాళం	ఎలక్షన్ డీటీ ఆదోని
ఎస్‌ఐ విరేంద్రగౌడ్	పెద్దకడబూరు	కౌతాళం
కె.శేషి శేఖరరావు	మంత్రాలయం	కోసిగి
డి.నజిముద్దీన్	తుగ్గలి	హొళగుంద
జే.రుద్రగౌడ్	కోసిగి	ఆదోని
జి.దీప	హొళగుంద	పెద్దకడబూరు
లక్ష్మీరాజు	గోనెగండ్ల	గోనెగండ్ల (సెలవు నుంచి విధులోకి)

కర్నూలు(సెంట్రల్): రానున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధి విధానాలను అనుసరించి 8 మంది డిప్యూటీ తహసీల్దార్లకు స్థాన చలనం కల్పిస్తూ బుధవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఉత్తర్వులు జారీచేశారు. బదిలీ అయిన తహసీల్దార్లు తక్షణమే విధుల్లో చేరాలని అందులో పేర్కొన్నారు.

ఫొటో, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్):కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులకు ఫొటో, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. ఈనెల 12 నుంచి 30 రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణకు 18 నుంచి 45 ఏళ్లలోపు వ యస్సు వారై, చదవడం, రాయడం వచ్చిన వా రు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయంకల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 63044 91236 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



బహుమతులు అందుకున్న విజేతలతో కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ డా క్టర్ జి.సృజన పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు బుధవారం తన చాంబరులో కలెక్టర్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. ఎవరైనా సరే నేరుగా వచ్చి సమస్యలను తనకు చెప్పుకోవచ్చన్నారు. మ్యూజికల్ చైర్ విభాగంలో జి.విజయలక్ష్మి, ఈ.లావణ్య విజేతలుగా నిలిచారు. అలాగే పాటల పోటీల్లో భావన, జి.విజయలక్ష్మి, జే.జయబాయి, వ్యాసరచన పోటీల్లో బి.నాగజ్యోతి, ఎంభవాని, కె.కృష్ణవేణి, అంత్యాక్షరిలో ఇందుమతి, కృష్ణవేణి, లావణ్య విజేతలుగా నిలవగా.. వారికి కలెక్టర్ బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు గిరికుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, మహిళా చైర్మన్ మల్లేశ్వరమ్మ, సెక్రటరీ ముంతాజ్‌బేగం పాల్గొన్నారు.

మల్లన్న 'మహా ప్రసాదం'

- శివరాత్రి బ్రహ్మోత్సవాలకు 35 లక్షల లడ్డూ ప్రసాదాలు
- ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయాలు



లడ్డూ ప్రసాదాన్ని తయారు చేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: మల్లన్న భక్తులకు ఎంతో ఇష్టమైనది లడ్డూ ప్రసాదం. శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనం అనంతరం భక్తులు ఇష్టంగా మల్లన్న లడ్డూ ప్రసాదాన్ని కొనుగోలు చేస్తారు. అలాగే బంధుమిత్రులకు ప్రసాదాన్ని తీసుకెళ్తారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవ సమయంలో లడ్డూ ప్రసాదానికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సుమారు 10లక్షలకు పైగా భక్తులు తరలివస్తారనే అంచనాతో 35 లక్షల లడ్డూలను సిద్ధం చేసి అందజేస్తున్నారు. రద్దీ నేపథ్యంలో అదనపు కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రసాదాలను విక్రయిస్తున్నారు. దేవస్థానం లడ్డూపోటులో ఉన్న 35 మంది సిబ్బందితో పాటు బ్రహ్మోత్సవాలకు ప్రత్యేకంగా విజయవాడ, ఇతర ప్రాంతాల నుంచి సుమారు 150 మంది సిబ్బందిని పిలిపించి లడ్డూ ప్రసాదాల తయారీ చేస్తున్నారు. భక్తులు అడిగినన్ని లడ్డూ ప్రసాదాలను ఇచ్చేందుకు దేవస్థాన అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. భక్తులు మహాప్రసాదంగా భావించి మల్లన్న లడ్డూ నాణ్యత, పరిమాణం ఖచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఈఓ పెద్దిరాజు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రద్దీ నేపథ్యంలో ఈ ఏడాది నూతనంగా గణేశ సదనం వద్ద లడ్డూ కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు.

క్యాన్సర్ రోగులకు సంజీవని!

- పూర్తయిన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్
- నేడు ప్రారంభించనున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- దీంతో పాటు కాలిన రోగుల వార్డు, ఎగ్జామినేషన్ హాలు, ఆధునికీకరించిన కలెక్టరేట్ భవన సదుపాయం ప్రారంభం

ప్రారంభానికి సిద్ధమైన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్





కాలిన రోగుల వార్డు భవనం



ఎగ్జామినేషన్ హాల్

కర్నూలు(హాస్పిటల్): అడ్డంకులను, అవరోధాలను అధిగమిస్తూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణం పూర్తయ్యింది. దీనిని గురువారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించనున్నారు. నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ క్యాన్సర్/డయాబెటీస్, సీవీడీ అండ్ స్ట్రోక్ గ్రాంట్ కింద 2016లో దీనిని మంజూరు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో దీని నిర్మాణం జరగాల్సి ఉంది. ఇందుకు సంబంధించి కేంద్రం తన వాటాను అప్పట్లో విడుదల చేసింది. అయితే అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. దీంతో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణం కలగానే మిగిలిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణానికి నిధులు విడుదల చేసింది. దీనిని రూ.120 కోట్లతో ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందులో రూ.36 కోట్లు సివిల్ పనులకు వెచ్చించారు. మిగిలిన మొత్తాన్ని వైద్యపరికరాల కొనుగోలుకు ఉపయోగిస్తున్నారు. భవన నిర్మాణం ఇప్పటికే పూర్తి కాగా వైద్యపరికరాలు ఒక్కొక్కటిగా వస్తున్నాయి. భవన నిర్మాణానికి సాంకేతిక సహకారాన్ని టాటా ట్రస్ట్(బాంబే) వారు అందించారు. వంద పడకలతో కర్నూలులోని కే ఆకారం స్ఫురించేలా దీని నిర్మాణం పూర్తయ్యింది. గ్రౌండ్ ఫ్లోర్‌లో కన్సల్టెన్సీ రూమ్స్, కెమో వార్డులు, రెండు లీనియర్ ఆక్సిలేటర్స్, ఒక బ్రాకీ థెరపీ, పెట్‌స్కాన్, ఎంఆర్‌ఐ, సీటీ, అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే రూమ్స్ ఉంటాయి. మొదటి అంతస్తులో వంద పడకలతో వార్డులు, పోస్టు ఆపరేటివ్ వార్డులు, ఐసీయు ఉంటాయి. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ క్యాన్సర్ రోగుల పాటి సంజీవనిలా పనిచేయనుంది.

మరో రెండు భవనాల ప్రారంభం

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌తోపాటు కాలిన రోగుల వార్డు, ఎగ్జామినేషన్ హాల్ కోసం నిర్మించిన రెండు భవనాలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం ప్రారంభించనున్నారు. ప్రివెన్షన్ అండ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ బర్న్స్ ఇంజ్యూరీస్ ప్రోగ్రామ్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో రూ.2.17కోట్లతో భవనం నిర్మాణం జరిగింది. వాస్తవంగా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరైనా ఇవ్వలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధుల విడుదల చేయడంతో లెప్రసి విభాగం పక్కన 8,415 చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాన్ని నిర్మించారు. ఇందులో ఆపరేషన్ థియేటర్, మైనర్ ఓటీ, ఏహెచ్‌యూ, ఐసీయూ, డ్యూటీ డాక్టర్, డ్యూటీ నర్సు రూమ్స్, బర్న్స్ ఓపీడీ, ఓపీడీ డ్రెస్సింగ్, నర్సు స్టేషన్, వార్డు రిహాబిలిటేషన్, వెయిటింగ్, ఎంట్రెన్సీ, లాబీ గదులను పూర్తి చేశారు.

అత్యాధునిక వసతులతో ఎగ్జామ్ హాల్

కర్నూలు మెడికల్ కాలేజీలో నూతన ఆడిటోరియం పక్కన నిర్మిస్తున్న ఎగ్జామ్ హాల్ దాదాపు పూర్తి కావచ్చింది. 900 మంది కెపాసిటీతో రూ.3.22కోట్లతో ఈ భవనాన్ని నిర్మించారు. 15,293 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీని నిర్మాణం జరిగింది. 2021 జులై 19వ తేదిన అగ్రిమెంట్ కుదిరిన తర్వాత ఇప్పటికే పని పూర్తి చేశారు. దీనికి డాక్టర్ వైఎస్‌ఆర్ ఎగ్జామినేషన్ హాలుగా నామకరణం చేశారు.

కలెక్టరేట్‌కు హంగులు

కలెక్టరేట్‌లో రూ.12 కోట్లతో చేపట్టిన ఆధునికీకరణ పనులు పూర్తయ్యాయి. ప్రతి కార్యాలయానికి అవసరమైన ఫర్నిచర్ సమకూర్చారు. ఇతర సదుపాయలు కల్పించారు. ఆధునికీకరించిన కలెక్టరేట్‌ను గురువారం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించనున్నారు.

గ్రానైట్ క్వారీల తనిఖీ

కర్నూలు (న్యూటౌన్): పత్తికొండ మండలంలోని పలు గ్రానైట్ క్వారీలను బుధవారం తనిఖీ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. దూదేకొండలో ఎస్‌వి మెటల్ స్టోన్ క్రషర్‌తో పాటు మరో గ్రానైట్ క్వారీని తనిఖీ జిల్లా మైనింగ్ విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారన్నారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్ పాల్గొన్నారు.

సారా స్థావరంపై సెబ్ దాడులు



సారా తయారీకి వినియోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్న సెబ్ సిబ్బంది

కర్నూలు: కర్నూలు మండలంలోని పసుపుల గ్రామంలో సారా స్థావరంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు దాడులు నిర్వహించారు. కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది నాటుసారా స్థావరంపై దాడులు జరిపి సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1,800 లీటర్ల బెల్లం ఊటను, 20 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశారు. అదే గ్రామానికి చెందిన షికారి తులసమ్మ సారా విక్రయిస్తున్నట్లు తెలుసుకుని ఆమెను అదుపులోకి తీసుకుని 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల మార్పునకు చర్యలు

కర్నూలు(సెంట్రల్): పోలింగ్ కేంద్రాల పేర్లు, లోకేషన్ల మార్పునకు చర్యలు తీసుకుంటున్నామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను జిల్లా కలెక్టర్ డాక్టర్‌జి.సృజన కోరారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో స్కూళ్ల ఎమలిమెంటరీ నుంచి ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల స్థాయి అప్‌గ్రేడ్ అయ్యాయని, వాటి పేర్లను మార్పు చేస్తామన్నారు. అలాగే కొన్ని పాఠశాలల ఉండే ప్రదేశాల పేర్లు కూడా మార్పు చెందాయని, దీంతో లోకేషన్లను మార్పు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఎస్‌పీ నుంచి ఎ.అరుణ్‌కుమార్,బీజేపీ నుంచి పీటీ సాయిప్రదీప్, వైఎస్‌ఆర్‌సీపీ నుంచి ఎస్.రాజేష్, కాంగ్రెస్ నుంచి జాన్ విల్సన్, టీడీపీ నుంచి ఎల్‌వీ ప్రసాదు, సీపీఎం నుంచి డి.గౌస్‌దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

గుడేకల్ కొండల్లో కార్చిచ్చు


- భయాందోళనలో కొండపక్క గ్రామాల ప్రజలు



గుడేకల్ కొండల్లో రాత్రి 10 గంటల ప్రాంతంలో ఎగిసిపడుతున్న మంటలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామ కొండల్లో కార్చిచ్చు చెలరేగింది. సాయంత్రం చిన్నగా మొదలైన మంటలు రాత్రి 10 గంటల ప్రాంతంలో పెద్ద ఎత్తున వ్యాపించాయి. ఈ మంటలు కొండచుట్టూ పాకే అవకాశం ఉంది. మంటలను అదుపు చేయటం కష్టం కావటంతో కొండపక్క గ్రామాలైన హనుమాపురం, గుడేకల్ ప్రజలు భయపడుతున్నారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించినా.. కొండల్లో వెళ్లటం సాధ్యం కావడం లేదు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించటంతో ఈ మంటలు వ్యాపించినట్లు తెలుస్తోంది.

పారుమంచాల సచివాలయ ఉద్యోగులకు మెమోలు



ఉదయం 11గంటలైనా తెరచుకోని తలుపులు

జూపాడుబంగ్లా: సకాలంలో విధులకు హాజరుకాని పారుమంచాల సచివాలయ ఉద్యోగులపై ఎంపీడీఓ నూర్జహాన్, జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో సచివాలయ పరిశీలనకు వెళ్లిన వారికి తాళం వేసి ఉండటంతో అవాక్కయ్యారు. పరిశీలనకు వస్తున్నట్లు సిబ్బందికి ముందుగానే సమాచారం ఇచ్చినా ఒక్కరూ కూడా హాజరు కాకపోవడంతో మండిపడ్డారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేయటంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన తొమ్మిది మంది సచివాలయ ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. మెమోలకు సరైన సమాధానం ఇవ్వకపోతే షోకాజ్ నోటీసు జారీ చేస్తామని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ఎవ్వరైనా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేదిలేదని ఎంపీడీఓ తెలిపారు.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం



మృతి చెందిన వన్నూర్‌బాషా

పత్తికొండ రూరల్: విద్యుదాఘాతంతో పత్తికొండలోని లక్ష్మీనగర్‌కు చెందిన గాజుల వ్యాపారి వన్నూర్‌బాషా (53) మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల సందర్భంగా పాతపేటలో రోడ్డుకిరువైపులా పలువురు చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. గాజుల అంగడి వేసిన వన్నూర్‌బాషా మంగళవారం రాత్రి 11గంటల సమయంలో వ్యాపారం ముగించుకుని విద్యుత్ బ్లోయర్‌తో గాజులపైన ఉన్న దుమ్ము దులుపుతుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య అబుదాబి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు.